# యశోదా గీతాలు

**ఆ బొమ్మలన్నీ ఒక మట్టితో తయారైనవే అని చూడంగానే తెలిసి పోతుంది.**

కూనా గుజ్జూ—అంతా ఐదుగురు !

తల్లిపోగానే తండ్రి పరాయివాడే అయ్యాడు. ఎప్పుడొస్తడో, ఎప్పుడుంటాడో, ఎప్పుడు పోతాడో_ ఆ పోలేరమ్మకే తెలియాలి.

తుంగభద్ర వొడ్డునే వుంది పోలేరమ్మగుడి. ఆ గుడికి కూతవేటు దూరంలో బుంగన్న ఇల్లు.

బుంగన్న సంతానం — గాయత్రి, రంగడు, లచ్చి, సూకమ్మ, చిన్ని. అదేవరసలో బూమ్మీద పడేసి తానెల్లి పోయింది చుక్కమ్మ. చిన్నిగాడు పుట్టాక వాతం కమ్మిం దన్నారు. తెల్లారేసరికే తీసుకెళ్ళిపోయాడు. అంతే బుంగన్న మళ్ళీ మనుషుల్లో పడ్లేదు. సారాలో మునిగేడు.

అప్పటిదాకా గోముగా పెరిగిన గాయత్రి—రాడి మోయాల్సివచ్చింది. తాలూతప్పా పోను గాసానికి పట్టుకు సరిపోయే గింజలొస్తయ్. అదే ఆధరువు. పాడీ గేదా కటుంది. ఉన్నట్టుండి నేతచీర కచ్చాపోసి కట్టుకోవడం నేర్చేసుకుంది గాయత్రి.

చెల్లెళ్ళూ తమ్ముళ్ళూ—అదుపులేని గుర్రాలు అగడ్తలుదాటాయన్న బాపతు.

భారంగా రోజులు వెళ్ళదీయడం కూడా నేర్చుకుంది గాయత్రి.

గాయత్రికి మాట సాయం, మనిషి సాయం—అంతా కమలమ్మ. కమలమ్మ కరణంగారి భార్య. వాళ్ళది పెద్దలోగిలి. బుంగన్న ఇంటికి ఎదురుగా వుంది. పదిమంది పాలేర్లూ, పాతిక పశువులూ—సిరీ సంపదా నెలకొన్న సంసారం, ఉన్నలోటల్లా—ఆమె కడుపున ఓ కాయ గాయకపోవడమే.

కనకమ్మకి కల్లాకాడూ లేదు. మనిషి నోరారా మాట్లాడుతుంది. గుమ్మడిపండులా వుంటుంది. వాళ్ళమ్మ జవ్వారీ ఆమెకు బాలతొడుగుగా వచ్చింది. ఎప్పుడూ పచ్చగా నిండుగా కాసుల పేర్లు, కంటే వడ్డాణాలతో కళకళలాడుతూ వుంటుంది. కళ్ళల్లో మాత్రం కసుగందు నెత్తలేదన్న నిరాశ కనిపిస్తూనే వుంటుంది.

ఇవాళ—

కరణంగారి లోగిలి సందడిగా వుంది. కమలమ్మ చెల్లెలు రాజ్యలక్ష్మి పట్నంనుంచి దిగింది—భర్తా, నలుగురు పిల్లల్తో. ఆమె నలుగురి సంతానంలోనూ ముగ్గురు మగ నలుసులు, ఒక్కర్తే ఆడపిల్ల. రాజ్యలక్ష్మి మంచి రంగు, పల్చటి కోలమొహం, సన్నగా, నాజూగ్గా వుంటుంది. పసుపుతాడు మినహా—బోసిమెడ, చేతులకి ఓ జత మట్టి గాజులు, ముక్కూ చెవులుకి కవరింగ్ నగలు. పెళ్ళినాటికి రాజ్యలక్ష్మిని బంగారంతో దిగేసే పంపేరు తల్లితండ్రులు. భర్త వ్యసనాలకి ఆభరణాలు ఒక్కొక్కటే గడపదాటేయి.

రాజ్యలక్ష్మి రెండోవాడు దాసుకీ, బుంగన్న కొడుకు రంగడికీ—ఆ సాయంత్రానికే దోస్తీ కలిసింది.

ఇద్దరూ పదకొండేళ్ళవాళ్ళే!

వాళ్ళిద్దరికీ పల్లెలోని చేలగట్లన్నీ రహదారులైనై. తుంగభద్రలో స్నానాలూ, ఈతలూ గట్టున నేరేడు పళ్ళు కొట్టుకోవడం. పదాలు పాడుతూ పరిగెత్తడం. సందెవేళ దాకా గోపాలస్వామి గుళ్ళో చెర్‌పట్టీలూ, చెడుగుడులూ— అడపాదడపా సున్నివుండలో, లోటాల్తో పాలో, జున్నో— ఆరగించిపోతూ వుండటం.

రంగడ్ని చూసి నొసలు చిట్లించుకునేది రాజ్యలక్ష్మి. మిర్రిమిర్రిగా చూసేది. తన కొడుకుతోపాటు వాడికీ ఈ ఆరగింపులు సాగడం—ఒక కంట్లో సున్నంలా వుండేది రాజ్యలక్ష్మికి. కానీ, కమలమ్మది మెతక స్వభావం. బంతిలో వలపక్షం చేసే తత్వంలేదు ఆమెకు.

పదిరోజులు గడిచినై.

ఆవేళ రాజ్యలక్ష్మి తిరుగు ప్రయాణం.

గాయత్రీ ఆమె చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ వీధి వాకిట్లో నిలబడి చూస్తున్నారు.

రాజ్యలక్ష్మి దాసుని కమలమ్మ చేతుల్లోపెట్టి వాడి బుగ్గలు పుణికింది, కళ్ళు తుడిచి భుజం తట్టింది. తల నిమిరింది.

దాసు సంబాళించుకుంటున్నాడు. అక్కపక్కన నిలబడ్డ రంగడు చెంగున దాసు దగ్గరికెళ్ళాడు. ఏవేవో వివరాలడిగాడు. ముకుపుటాలెగరేస్తూ సమాధానా లిస్తున్నాడు దాసు.

"ఎప్పుడూ ఇక్కడే ఉండిపొమ్మంటే ఇంకేం— హాయిగా వుండొచ్చుగా" రంగడి ప్రశ్న.

"ఆమ్మో. నేను మా అమ్మని వొదిలి వుండను."

"నే నున్నాగా"

" నువ్వంటే మాత్రం !" రంగడు మొహం చిన్నబుచ్చుకున్నాడు. దాసు చెప్పుకుంటూ పోతున్నాడు. "మా అమ్మ లేకుండా ఎల్లకాలం ఇక్కడుండటమే. అమ్మో అసలీ పెంపుళ్ళ నా కిష్టంలేదు."

రాజ్యలక్ష్మి, ఆమె భర్తా, ముగ్గురు పిల్లలూ బండి ఎక్కేరు. కరణంగారూ, కమలమ్మ, దాసూ బండి వెనగ్గా నిలబడి వీడ్కోలు చెప్తున్నారు.

ఎద్దుల గంటల చప్పుడైంది. బండి కదిలింది.

ఉన్నట్టుండి—మేఘం వర్షించింది. గంగా ప్రవాహమే !— దాసు వెక్కులు పెడ్తూ బండిలో కెక్కేశాడు బండి ఆగింది.

దాసుని తీసుకుని కిందికి దిగింది రాజ్యలక్ష్మి. వాణ్ణి బుజ్జగించింది, లాలించింది, ఏవేవో ఆశలు చూపింది.

మిల్లిలా మొహంపెట్టి అక్కకేసి నడిచాడు, రంగడు.

చెంగుతో కళ్ళొత్తుకుంది కమలమ్మ. దాసు ఈసారి బండిలోకి ముందుగా తానే ఎక్కికూర్చున్నాడు. 'నే తర్వాత ఉత్తరం రాస్తాలే అక్కా. కొన్నాళ్లు పోనీ, చూద్దాం.' అంటూ తనూ బండిలోకి చేరింది రాజ్యలక్ష్మి. కమలమ్మ ఏ జవాబూ చెప్పలేదు. బండి కదిలింది.

అక్కతోపాటు ఇంట్లోకి వెళ్తూ అడిగేడు, రంగడు "ఆ దానుగాడుండనంటుంటే అట్టా బలవంతం చెయ్యకపోతే, నన్నుంచుకోవచ్చుగా అక్కా" అని.

ఉలిక్కిపడి తమ్ముడి కళ్ళల్లోకి చూసింది, గాయత్రి. ఆమెకు అమ్మ గుర్తుకొచ్చింది. చెమర్చిన కళ్ళతో తమ్ముణ్ణి దగ్గరికి తీసుకుంది.

ఆకాశంలో పిట్టలు పల్లటీలు కొడుతున్నై!